వేడుకలకు ఆలయం ముస్తాబు

- దాతల చేయూతతో కమలాపురం అంకమ్మ తల్లి ఆలయాభివృద్ధి
- రెండేళ్లనుంచి సాగుతున్న పనులు
- నేటి నుంచి ప్రారంభంకానున్న జాతర
- అమ్మవార్ల విగ్రహాలు పునఃప్రతిష్ఠ

సండే స్పెషల్


కమలాపురంలో పునఃప్రతిష్ఠాపనకు సిద్ధమైన శ్రీఅంకమ్మతల్లి దేవాలయం

ముదిగొండ: ఖమ్మం జిల్లా ముదిగొండ మండలం కమలాపురంలో దశాబ్దాలుగా వెంచేసి ఉన్న శ్రీ అంకమ్మ, శ్రీమహాలక్ష్మీ, మద్దిరావమ్మ, నాగేంద్రస్వామి, పెద్దమ్మతల్లి అమ్మవార్ల ఆలయం దశాబ్దాలుగా చరిత్ర కలిగి ప్రఖ్యాతి గాంచింది. ఈ ఆలయం ఖమ్మం జిల్లాలో కమలాపురంలో ప్రతి ఏటా మార్చిలో వచ్చే హోళీకి ప్రారంభమై ఐదురోజుల పాటు భక్తులు ఘనంగా జరుపుకుంటారు. ఆచార సాంప్రదాయాలతో ఎంతో ముచ్చటిగా కనువిందుగా పూజాకార్యక్రమాలతో మొదలై చూడముచ్చటగా కల్యాణ క్రతువు నిర్వహిస్తుంటారు. పురాతన ఆలయం కావడంతో ఆలయ అభివృద్ధికి ఈ ఏడాది దాతలు ముందుకొచ్చారు. దాతల సాయంతో రూ.40 లక్షలతో శ్రీఅంకమ్మ, మద్దిరావమ్మ, మహాలక్ష్మీ, నాగేంద్రస్వామి, పెద్దమ్మ తల్లి, పోతురాజు విగ్రహాల పునఃప్రతిష్ఠ, ఆలయం ముందుబాగం, గోపురాలతో నూతన నిర్మాణాలతో అలంకరింపజేశారు. అమ్మ అపారమైన శక్తిమయి. అనేక రూపాలలో ప్రపంచాన్ని పరిపాలిస్తూ ఎవరికి ఏం కావాలో ప్రసాదించే ఆశ్రిత కల్పవృక్షం – అమ్మవారు. పుత్ర, పౌత్ర, ధన, ధాన్యాదులు, భోగ, భాగ్య, భూషణ రాజ్యభోగాలను ప్రసాధించే తల్లి మహాలక్ష్మీ. ఎంతో కాలంగా భక్తుల కోరిన కోర్కెలు తీర్చే శ్రీమహాలక్ష్మీ, అంకమ్మ, మద్దిరావమ్మ, పెద్దమ్మ ఆలయాలను పునరుద్ధరణ జరుపుతున్నారు. ఈ జాతరకు భక్తులు ఖమ్మం జిల్లా నుంచే కాక కోదాడ, సూర్యాపేట, జగ్గయ్యపేట, కొత్తగూడెం నుంచి వేలాదిగా తరలివచ్చి తమ మొక్కులు తీర్చుకుంటారు. ఈ నెల 5న సాయంత్రం నుంచి మొదలౌతుంది. శోభాయాత్ర, విశ్వక్సేనారాధన, పుణ్యాహవచనం, అంకురార్పణ, నీరాజనం, తీర్థప్రసాద వితరణ, 6న హోమాలు, అగ్నిమధనం, అష్టకలశ స్నపన, నీరాజనం, తీర్థప్రసాద వితరణ సాయంకాల పూజా కార్యక్రమాలు నిర్వహిస్తారు. 7న అమ్మవారి విగ్రహాల నదియాత్ర, జలబిందెల గ్రామోత్సవం, మున్నేటి నదీ తీరంలో జలాదివాస, అనంతరం ఊరేగింపు, 8న శతాష్టక హోమాలు, చండీహోమం, విశేషార్చన, తీర్థప్రసాదముల పంపిణీ. 9న గురువారం ఉదయం 4గంటలకు యంత్రస్నపన, ఉదయం 6:59 నిమిషాలకు ప్రతిష్ఠమహోత్సవం కార్యక్రమాలు నిర్వహిస్తారు. గ్రామంలో అంకమ్మ భక్తులు 20రోజులు పాటు మాల ధరించి పూజా కార్యక్రమాలు నిర్వహిస్తుంటారు.

ఆలయ అభివృద్ధికి సహకరిస్తున్నారు..



శ్రీఅంకమ్మతల్లి ఆలయం ఎంతో చరిత్ర కలిగిన దేవాలయం. గత నాలుగేళ్ల నుంచి గ్రామంలోనే సేకరించిన విరాళాలతో పాటు మావంతు సాయంగా విరాళం అందించి ఆలయాన్ని అభివృద్ధి చేసుకున్నాం. మిగిలిన పనులు కూడా పూర్తి చేస్తాం. భక్తులకు ఎక్కాడ అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేశాం.

– వల్లూరి భద్రారెడ్డి, దాత, కమలాపురం

తల్లి దయతోనే అభివృద్ధి..



ఆలయానికి సహకరించేందుకు కమలాపురం, అయ్యగారిపల్లి నుంచి దాతలు ముందుకురావడంతో ఆలయ పునఃప్రతిష్ఠ కార్యక్రమాలు చేపట్టాం. అమ్మవార్ల విగ్రహాలు, ఆలయ గోపురాలు, అందరి బాగస్వామ్యంతోనే అంకమ్మ తల్లి ఆలయాన్ని అభివృద్ధి పరుచుకున్నాం.

– డి.ఆదినారాయణరెడ్డి, దాత, అయ్యగారిపల్లి

క్లుప్తంగా

కలెక్టర్‌కు వినతి


కలెక్టర్ గౌతమ్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే సండ్ర, ఎస్సీ సెల్ అధ్యక్షుడు ప్రభాకర్

పెనుబల్లి : 2021–2022 సంవత్సరంలో మంజూరైన ఎస్సీ కార్పొరేషన్ యూనిట్లకు సబ్సిడీ అమౌంట్‌ను విడుదల చేయాలంటూ సత్తుపల్లి ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య ఆధ్వర్యంలో మండల బీఆర్‌ఎస్‌పార్టీ ఎస్సీ సెల్ అధ్యక్షుడు కోట ప్రభాకర్ శనివారం జిల్లా కలెక్టర్ గౌతమ్‌కు వినతిపత్రం అందజేశారు. ఎస్సీ కార్పొరేషన్ యూనిట్లు మంజూరై సంవత్సరం కావస్తున్నా ఇప్పటి వరకు సబ్సిడీ అమౌంట్ మంజూరు కాకపోవడంతో అర్హులైన లబ్ధిదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. వెంటనే సబ్సిడీను విడుదల చేయాలంటూ కలెక్టర్ వీపీ గౌతమ్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో మండల సర్పంచ్‌ల అధ్యక్షుడు అశోక్‌కుమార్, లబ్ధిదారులు పాల్గొన్నారు.

న్యాయం చేశాక భూమి తీసుకోండి


అధికారులతో వాగ్వాదం చేస్తున్న రైతు గోవర్ధన్

సత్తుపల్లిటౌన్: సత్తుపల్లి తామరచెరువు శిఖంలో ఉన్న ఎకరం భూమిని సర్వే చేసేందుకు అధికారులు వెంకటరత్నం, నాగు, ఆర్‌ఐ జానిమియా శనివారం చేరుకున్నారు. అయితే ఆ భూమి తన పేరిట ఉందని గుడిపాడుకు చెందిన రైతు పూచి గోవర్ధన్ అధికారులను అడ్డగించారు. 40 ఏళ్లుగా సాగు చేసుకుంటూ ఆ భూమిపైనే ఆధారపడి జీవనం సాగిస్తున్నామని వాపోయాడు. పాస్ పుస్తకం కూడా ఉందని.. సదరు భూమికి బదులుగా భూమిని ఇవ్వాలని కోరాడు. ఈ విషయంపై కలెక్టర్‌ను కలిసి విన్నవిస్తానని చెప్పటంతో అధికారులు వెనుదిగారు.

వైభవంగా హరిహర క్షేత్రం వార్షికోత్సవం

వేంసూరు: మండలంలోని లింగపాలెం హరిహరక్షేత్రం ఆలయ 3వ వార్షికోత్సవ వేడుకలు శనివారం అంగరంగ వైభవంగా ప్రారంభమైయ్యాయి. ఈ సందర్భగా ఆలయానికి మంగళ తోరణం, గణపతిపూజ, స్వామివార్లుకు విశేష అభిషేకం, హనుమాన్ చాలిసా, శివపార్వతుల కల్యాణమహోత్సవం నిర్వహించారు. దీంతో ఆలయానికి లింగపాలెం గ్రామానికి చెందిన గన్నేన్ని సత్యనారాయణ, నీలావతి దంపతులు రూ.60,116 విరాళం ఆలయ కమిటీ సభ్యులకు అందించారు.

కళాశాలకు పుస్తకాలు అందజేత


'సృజన వేదిక' పుస్తకాలు అందజేస్తున్న దృశ్యం

సత్తుపల్లిటౌన్: సృజన సాహితీ సమాఖ్య ఇటీవల ప్రచురించిన 'సృజన వేదిక'సంచికలను సత్తుపల్లి జేవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ పానెం రామచంద్రరావుకు శనివారం అందించారు. కళాశాల గ్రంథాలయంలో విద్యార్థులకు ఉపయోగపడేలా వీటిని అందించడం జరిగింది. కార్యక్రమంలో రామకృష్ణ, వాసు, మధుసూదన్‌రాజు ఉన్నారు.

వృద్ధురాలి అదృశ్యం

చింతకాని: మండలంలోని పందిళ్లపల్లి గ్రామానికి చెందిన వృద్ధురాలు వజ్రాల వెంకట్రావమ్మ అదృశ్యమైంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మానసిక స్థితి సరిగా లేని వెంకట్రావమ్మ గత పది రోజుల క్రితం ఇంటి నుంచి వెళ్లిపోగా ఆమె చిన్న కుమారుడైన హరీష్ బంధువుల వద్ద ఉన్న ఆమెను ఇంటికి తీసుకుని వచ్చాడు. మరల ఆమె గత నెల 27న ఇంటి నుంచి వెళ్లిపోయింది. హరీష్ ఫిర్యాదు మేరకు ఎస్సై పొదిల వెంకన్న కేసు నమోదు దర్యాప్తు జరుపుతున్నారు.

పద్మనాభరావు మృతికి నివాళి

సత్తుపల్లిటౌన్: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంఘం సీనియర్ నాయకుడు ఊటుకూరి పద్మనాభరావు(80) శనివారం అనారోగ్యంతో మృతి చెందారు. ఆర్ అండ్‌బీ శాఖలో సుదీర్ఘకాలం పని చేసిన పద్మనాభరావు ఉద్యోగ విరమణ అనంతరం విశ్రాంత ఉద్యోగుల సంఘంలో వివిధ హోదాల్లో పని చేసి సేవలందించారు. వెంగళరావునగర్‌లో గల పద్మనాభరావు భౌతిక దేహాన్ని విశ్రాంత ఉద్యోగుల సంఘం నాయకులు వి.చెంచిరెడ్డి, బద్రుద్దీన్, ప్రకాశరావు, కేశవరెడ్డి, ప్రసాదరావు, అద్దంకి వెంకటరత్నం, బి.మధుసూదన్ రాజులు సందర్శించి నివాళి ఘటించారు.

మత్స్యకారులకు అవగాహన


మాట్లాడుతున్న ఎంపీపీ రఘు

కల్లూరు: సత్తుపల్లి నియోజకవర్గంలోని కల్లూరు, సత్తుపల్లి, పెనుబల్లి, వేంసూరు మండలాల మత్స్య సహకార సంఘ సభ్యులకు ప్రభుత్వ పథకాలపై శనివారం అవగాహన కల్పించారు. కల్లూరు రైతు వేదికలో ఏర్పాటు చేసిన సమావేశంలో జిల్లా మత్స్య శాఖ అధికారి ఆంజనేయస్వామి, ఎంపీపీ బీరవల్లి రఘు మాట్లాడుతూ ప్రధానమంత్రి మత్స్య సంపద యోజన (పీఎంఎంఎస్‌వై) ద్వారా ఈ – రిక్షాలు, త్రిచక్ర వాహనాలు అందించనున్నట్లు తెలిపారు. అలాగే, వలలు, పడవలపై సబ్సిడీపై తదితర అంశాలను వివరించారు. కాగా, మత్స్య సహకార సంఘాల్లో 18ఏళ్లుగా నిండిన వారు సభ్యులుగా నమోదు చేసుకోవచ్చని తెలిపారు. ఈసమావేశంలో జెడ్పీటీసీ కట్టా అజయ్‌కుమార్, తహసీల్దార్ బాబ్జీప్రసాద్, ఎంపీడీఓ రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

జనచైతన్య యాత్రను విజయవంతం చేయండి


మాట్లాడుతున్న పొన్నం వెంకటేశ్వరరావు

బోనకల్: ఈ నెల 15న సీపీఎం ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా నిర్వహించనున్న జనచైతన్య యాత్రను విజయవంతం చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జాతీయకమిటీ సభ్యుడు పొన్నం వెంకటేశ్వరావు కోరారు. మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో శనివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ యాత్ర ఈ నెల 22న బోనకల్ మండల కేంద్రానికి చేరుకుంటుందన్నారు. మండల కేంద్రంలో భారీ బహిరంగ సభ ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి దొండపాటి నాగేశ్వరరావు, కోటేశ్వరరావు, శ్రీనివాసరావు, పంతు, రమేష్, నరేష్, కొరివి, అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

సీతారామయ్య త్యాగాలను స్మరించుకోవాలి


మాట్లాడుతున్న బాగం హేమంతరావు

కొణిజర్ల: పేదప్రజలకు అండగా ఎర్రజెండా చేతబూని రజాకార్లకు ఎదురెళ్లి ప్రాణ త్యాగానికి సైతం లెక్క చేయని గడల సీతారామయ్య త్యాగాలను నేటి యువత స్మరించుకోవాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు బాగం హేమంతరావు అన్నారు. తనికెళ్ల మాజీ సర్పంచ్ తెలంగాణ సాయుధ పోరాట వీరుడు గడల సీతారామయ్య 46వ వర్ధంతి శనివారం తనికెళ్లలో నిర్వహించారు. ఈ సందర్భంగా పలు పార్టీల నాయకులు ఆయన సమాధి వద్ద పూల మాలలేసి నివాళులు అర్పించారు. కేంద్ర ప్రభుత్వం నిరుపేదలను దోచుకుని కేవలం అంబానీ, అదానీలకు ప్రభుత్వ ఆస్తులన్నీ కట్ట బెడుతుందన్నారు. బీజేపీ ప్రభుత్వాన్ని గద్దె దించేవరకు పోరాడాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు యర్రా బాబు, జిల్లా కార్యదర్శి పోటు ప్రసాద్, రమేష్, వెంకటేశ్వరరావు, పీవీరావు, గడల సీతారామయ్య, శ్రీనివాసరావు, భాస్కర్ పాల్గొన్నారు.

విద్యార్థులకు మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ


విద్యార్థులకు మజ్జిగ ప్యాకెట్లు అందిస్తున్న యువకులు

కారేపల్లి: రోజు రోజుకు ఎండ తీవ్రత అధికం కావడంతో.. కారేపల్లికి చెందిన యువకులు వైభవ్ మనియార్, గిరిధర్ బూబ్, తరుణ్ బూబ్, ఠాగూర్ పవన్‌లు తమవంతు సాయంగా కారేపల్లిలో మజ్జిగ ప్యాకెట్లను శనివారం పంపిణీ చేశారు. కారేపల్లి ప్రాథమిక పాఠశాలలోని విద్యార్థులకు, కారేపల్లి ప్రభుత్వ ఆస్పత్రిలో రోగులకు, బస్టాండ్ సెంటర్‌లోని ప్రయాణికులకు మజ్జిగ పాకెట్లను పంపిణీ చేసి తమ ఉదారతను చాటుకున్నారు.

చిన్నారుల దాతృత్వం స్ఫూర్తిదాయకం



లికిన్‌సాయికి ఆర్థిక సాయం అందజేస్తున్న విద్యార్థులు, ఉపాధ్యాయులు, మున్సిపల్ చైర్మన్ మహేష్

సత్తుపల్లిరూరల్: మండలంలోని పాతసెంటర్‌లో చదువుతున్న ఒకటో తరగతి విద్యార్థి తోటకూర లికిన్ సాయి తీవ్ర అనారోగ్యానికి గురై ఖమ్మం ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. దీంతో తోటి స్నేహితుల తల్లితండ్రులు, ఉపాధ్యాయులు, మున్సిపల్ చైర్మన్ రూ.12,222 వేలు సేకరించారు. శనివారం పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ప్రసాద్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మున్సిపల్ చైర్మన్ పాల్గొని చిన్నారి తల్లితండ్రులకు ఆర్థిక సాయం అందించి మాట్లాడారు. రామకృష్ణ, శాంతిప్రియ దంపతుల కుమారుడు ఊపిరితిత్తుల వ్యాధితో ఖమ్మం ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడన్నారు. దీంతో ఉపాధ్యాయులు, పాఠశాల యాజమాన్య కమిటీ అందించిన సాయాన్ని 18వ వార్డు కౌన్సిలర్ గ్రాండ్ మౌలాలి, లికిన్‌సాయి తల్లితండ్రులకు అందించారు. ఈ సందర్భంగా ఆ కుటుంబానికి అన్నివాదాలుగా తమ వంతు సాయాన్ని అందిస్తానన్నారు. కార్యక్రమంలో ఎస్‌ఎంసీ చైర్మన్ వెంకటేశ్వరరావు, పాఠశాల యాజమాన్య కమిటీ సభ్యులు ఆస్మా, కవిత, శిరీష, లక్ష్మీ, స్రవంతి, వాణి, నాగూర్‌బీ, అనీషా, అబ్దుల్లా, నాగుల్‌మీరా, గురుమూర్తి, ఉపాధ్యాయులు నాగమణి, జయశ్రీ, లాల్ అహ్మద్, పవన్, నర్సింహారావు, విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రకాశంకు పలువురి నివాళి


ప్రకాశం చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న ఎమ్మెల్యే రాములునాయక్

వైరా: వైరా మున్సిపాలిటీ పరిధిలోని దిద్దుపూడిలో ఇటీవల అకాల మరణం చెందిన కొచ్చెర్ల ప్రకాశం మృతికి వైరా ఎమ్మెల్యే లావుడ్యా రాములునాయక్ తీవ్ర సంతాపం ప్రకటించారు. ఆర్‌అండ్‌బీ శాఖలో పని చేసిన పదవీ విరమణ పొందిన ప్రకాశం మృతి చెందగా శనివారం ఆయన సంస్మరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే ప్రకాశం చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఆయన వెంట ఏఎంసీ చైర్మన్ బీడీకే రత్నం, కట్టా కృష్ణార్జునరావు, మద్దెల రవి, సురేష్, సోబు, రూబేన్, తదితరులున్నారు. కాగా ప్రకాశం కుటుంబ సభ్యులను మాజీ ఎమ్మెల్యే బానోత్ చంద్రావతి, సీపీఐ రాష్ట్ర నాయకుడు హేమంతరావు, జిల్లా నాయకుడు బాబు, మండల కార్యదర్శి గోపాలరావు పరామర్శించి ప్రకాశం చిత్రపటం వద్ద నివాళులు అర్పించారు.

చిరస్మరణీయుడు మచ్చా


మచ్చా లక్ష్మణ్‌రావు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న స్నేహితులు

సత్తుపల్లి: స్నేహానికి ప్రాణమిచ్చే మిత్రుడు మచ్చా లక్ష్మణ్‌రావు చిరస్మరణీయుడని మిత్ర బృందం పేర్కొంది. సత్తుపల్లిలోని కాకర్లపల్లి రోడ్ రావిచెట్టు వీధిలో శనివారం జూపల్లి పటేల్ ఆధ్వర్యంలో మచ్చా లక్ష్మణ్‌రావు సంస్మరణ సభను ఘనంగా నిర్వహించారు. లక్ష్మణ్‌రావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. గత నాలుగు దశాబ్దాలుగా తమ మిత్రుడితో ఉన్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో గరిమెళ్ల శ్రీను, బీమిశెట్టి శ్రీనివాసరావు, చిన్ని, కిట్టు, సతీష్, యాసీర్, హనుమంతు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన అవసరం


మధిర : మాట్లాడుతున్న న్యాయమూర్తి ధీరజ్ కుమార్


సత్తుపల్లిటౌన్: మాట్లాడుతున్న అదనపు జిల్లా జడ్జి శివరాంప్రసాద్

మధిర/సత్తుపల్లిటౌన్/కారేపల్లి: మహిళల హక్కులు, చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని మధిర కోర్టు న్యాయమూర్తి డి.ధీరజ్ కుమార్, అదనపు జిల్లా జడ్జి శివరాంప్రసాద్, లీగల్ సెల్ ప్రతినిధులు స్వప్న, కల్యాణిలు తెలిపారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని శనివారం మధిరలోని ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయంలో, సత్తుపల్లి కోర్టులో, కారేపల్లి మండలంలోని అప్పాయిగూడెం రైతువేదిక భవనంలో వారు పాల్గొని మాట్లాడారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లలను పెంచే విషయంలో, వారి మానసిక, శారీరక ఆరోగ్యం గురించి, వారిలో నైతిక విలువలను పెంచేవిధంగా అంగన్‌వాడీ టీచర్లు కృషి చేయాలని సూచించారు. మహిళా దినోత్సవ వారోత్సవాలను ఘనంగా నిర్వహించాలని సూచించారు. గృహహింస, నిర్భయ, చైల్డ్ మ్యారేజ్ యాక్టు, సమాజంలో పెరిగే నేర ప్రవృత్తిలో మార్పు రావాలంటే మహిళల పాత్ర ఏమిటి అనే అంశాలపై అవగహన కల్పించారు. ఈ కార్యక్రమాల్లో మున్సిపల్ చైర్ పర్సన్ మొండితోక లత, వైస్ చైర్ పర్సన్ శీలం విద్యాలత, ఎంపీపీ లలిత, న్యాయవాదులు వాసంశెట్టి కోటేశ్వరరావు, చావలి రామరాజు, ఐసీడీఎస్ సిబ్బంది , సీనియర్ సివిల్ జడ్జి పి.అరుణకుమార్, జూనియర్ సివిల్ జడ్జి శ్రావణస్వాతి, అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి అయేషా శరీన్, బార్ అధ్యక్షులు ఎంవి రాజేంద్రప్రసాద్, న్యాయవాదులు, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు రోహిణి, రమాదేవి, రాధ, సుభద్ర, పుష్ప పాల్గొన్నారు.

బాల్య వివాహాలను నిర్మూలించాలి


మాట్లాడుతున్న ఎంపీడీఓ వేణుమాదవ్

బోనకల్: బాల్యవివాహాలను నిర్మూలించాలని ఎంపీడీఓ వేణుమాదవ్ అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో శనివారం బాల్యవివాహాలు, బాలకార్మిక వ్యవస్థపై ఎఫర్ట్ సంస్థ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రస్తుత సమాజంలో ఆడపిల్లలు ఎంతో ఉన్నత స్థాయిలో ఉన్నారని బాల్యవివాహం అనేది కొంతమంది పిల్లలకు శాపంగా మారుతుందన్నారు. ఇలాంటి వాటిని నిర్మూలంచేందుకు 100 లేదా 1098 నంబర్‌లకు ఫోన్ చేసి సమాచారం అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎఫర్ట్ సంస్థ సభ్యులు విజయ్‌కుమార్, హెల్త్ సూపర్‌వైజర్ దానయ్య, రాజ్యలక్ష్మి, సంస్థ సభ్యులు సోని, సౌజన్య, సురేష్, కరుణ, అరుణ, స్వాతి పాల్గొన్నారు.

ఎంపీడీఓ కార్యాలయం ఎదుట ధర్నా


ధర్నా చేస్తున్న ముస్లిం మైనార్టీలు

ఏన్కూరు: మండలంలో ముస్లిం మైనార్టీలు అనేక మంది ఉన్నా తెలంగాణ ప్రభుత్వం రుణాలు మంజూరు చేయడంలో నిర్లక్ష్యంగా వ్యవహరించిందని ఆరోపిస్తు స్థానిక ఎంపీడీఓ కార్యాలయం ఎదుట ముస్లిం యువతి, యువకులు ధర్నా నిర్వహించారు. మండల కేంద్రంలో 2022–23 సంవత్సరంలో రుణాల మంజూరి కోసం ముస్లిం మైనార్టీలు దరఖాస్తు చేసుకున్నారు. వీరు రూ.1లక్ష, రూ.2 లక్షల యూనిట్ల కొరకు మొత్తం 169 మంది దరఖాస్తు చేసుకోగా వీరికి ఎంపీడీఓ బయ్యారపు అశోక్ స్థానిక మండల కార్యాలయంలో ఇంటర్వ్యూ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఒక్కరికి మాత్రమే రూ.1 లక్ష యూనిట్ మంజూరు అయ్యిందన్నారు. మీ అందరి అనుమతితో లక్ష యూనిట్ 78 మంది దరఖాస్తుదారులకు లాటరీ ద్వారా ఎంపిక చేయడం జరుగుతుందన్నారు. దీంతో ఆగ్రహించిన లబ్ధిదారులు ధర్నా నిర్వహించి కేసీఆర్‌కు వ్యతిరేఖంగా నినాదాలు చేశారు. ప్రభుత్వం ముస్లిం మైనార్టీలపై చిన్న చూసు చూస్తుందన్నారు.

ర్యాంగింగ్‌ను విడనాడాలి



మాట్లాడుతున్న ఎస్సై సాయికుమార్

ఏన్కూరు: కళాశాలల్లో ర్యాగింగ్‌ను విడనాడాలని ఎస్సై సాయికుమార్ కోరారు. మండల కేంద్రంలోని గురుకుల విద్యాలయం, కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయాల్లో శనివారం ర్యాగింగ్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కళాశాలల్లో సీనియర్స్ జూనియర్స్‌ను ర్యాగింగ్ చేయడం వలన అనేక మంది ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని, ఈ సంస్కృతిని పారద్రొలాలన్నారు. అందరు సోదర భావంతో మెలగాలన్నారు. మత్తుపదార్థలకు బానిసలు కావదన్నారు. కార్యక్రమంలో గురుకుల విద్యాలయం, కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయం ప్రిన్సిపాల్స్ శ్రీనివాసరెడ్డి, ఉషారాణి తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ వైఫల్యాలను వివరించాలి


మాట్లాడుతున్న ఏలూరి నాగేశ్వరరావు

మధిర: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు వివరించాలని బీజేపీ మధిర అసెంబ్లీ కన్వీనర్ ఏలూరి నాగేశ్వరరావు అన్నారు. శనివారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బీఆర్‌ఎస్, కాంగ్రెస్ చీకటి స్నేహంతోనే ప్రభుత్వాన్ని కాంగ్రెస్ పార్టీ ప్రశ్నించడం లేదన్నారు. గ్యాస్ ధరలు పెరిగాయని నిరసనలు తెలుపుతున్న కాంగ్రెస్ పార్టీ ప్రీతి లాంటి ఆడబిడ్డ మరణిస్తే ఎందుకు నిరసన తెలపలేదని ప్రశ్నించారు. అదేవిధంగా విద్యుత్, ఆర్టీసీ, భూముల రిజిస్ట్రేషన్ చార్జీలు, మద్యం రేట్లు విపరీతంగా పెరిగితే కాంగ్రెస్ పార్టీకి ప్రశ్నించడం చేతకాలేదని అన్నారు. ఈ సమావేశంలో బీజేపీ పట్టణ అధ్యక్షుడు పాపట్ల రమేష్, కృష్ణారావు, మర్స కట్ల స్వర్ణాకర్, కనపర్తి ప్రకాష్, పెరుమాళ్లపల్లి మోహన్‌రావు, రామకృష్ణ, జానిమియా తదితరులు పాల్గొన్నారు.

గ్యాస్ ధరలు తగ్గించాలని ధర్నా


మధిర: ధర్నా చేస్తున్న సీపీఐ నాయకులు

మధిర: కేంద్రం పెంచిన గ్యాస్ ధరలను వెంటనే తగ్గించాలని డిమాండ్ చేస్తూ సీపీఐ ఆధ్వర్యంలో మధిర తహసీల్ వద్ద శనివారం ధర్నా నిర్వహించారు. ఈ ధర్నాను ఉద్దేశించి సీపీఐ నాయకులు వూట్ల కొండలరావు, పెరుమాళ్ళపల్లి ప్రకాష్‌రావు మాట్లాడుతూ.. ఎన్నికల ముందు సామాన్య ప్రజలకు కుటుంబ అకౌంట్లో రూ.15లక్షలు జమ చేస్తామని చెప్పి అధికారంలోకి వచ్చిన కేంద్ర ప్రభుత్వం ఆ హామీ అమలు చేయడం లేదని ఆరోపించారు. అదేవిధంగా పెట్రోల్, డీజిల్ ధరలను వెంటనే తగ్గించాలని డిమాండ్ చేశారు.

సత్తుపల్లిరూరల్: పెంచిన గ్యాస్ ధరలను తగ్గించాలని కోరుతూ సీపీఎం సత్తుపల్లి పట్టణ కమిటీ ఆధ్వర్యంలో పాతసెంటర్‌లో రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కమిటీ సభ్యులు మోరంపూడి పాండురంగారావు, పట్టణ కార్యదర్శి రావుల రాజబాబు మాట్లాడారు. కేంద్రంలో సామాన్య ప్రజలు నడ్డి విరిచే విధంగా కేంద్ర ప్రభుత్వం వహిస్తుందన్నారు. కార్యక్రమంలో కొలికపోగు సర్వేశ్వరరావు, వలీ, బాజీ, రమేష్, రవి, వెంకటేశ్వరరావు, నాగేశ్వరరావు, రామకృష్ణ, సైదా, చంద్రం, బాబు, కిరణ్, భాష, ఏసు పాల్గొన్నారు.


సత్తుపల్లిరూరల్: తాళ్లతో ఆటోను లాగుతూ నిరసర ప్రదర్శన చేస్తున్న సీపీఎం నాయకులు


కొణిజర్ల: దిద్దుపూడిలో మహిళలతో కలిసి ఆందోళన చేస్తున్న మాజీ ఎమ్మెల్యే చంద్రావతి

కొణిజర్ల: కేంద్రం పెంచిన గ్యాస్ ధరలు తగ్గించేవరకు బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో అలుపెరగని పోరాటం నిర్వహిస్తామని వైరా మాజీ ఎమ్మెల్యే బానోత్ చంద్రావతి అన్నారు. మండలంలోని దిద్దుపూడి గ్రామంలో శనివారం చంద్రావతి నేతృత్వంలో పలువురు మహిళలు ఖాళీ గ్యాస్ బండలతో నిరసన ప్రదర్శన చేశారు. అనంతరం చంద్రావతి మాట్లాడుతూ.. కార్పొరేట్ శక్తులకు కొమ్ముకాస్తున్న కేంద్ర ప్రభుత్వాన్ని గద్దె దించి సీఎం కేసీఆర్ నేతృత్వంలోని రైతు సర్కార్‌ను గద్దె నెక్కించాలన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, మహిళలు పాల్గొన్నారు.